క్లుప్తంగా

నేడు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఒంగోలు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించనున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సోమవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ప్రత్యేకంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ఒంగోలు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సూర్యప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలకు కేంద్రీయ విద్యాలయం నోడల్ స్కూల్‌గా పనిచేస్తోందని, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యాబోధన చేసే పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొంటారని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు చిత్రలేఖనానికి అవసరమైన సామగ్రి అందిస్తామన్నారు. పోటీల్లో మొదటి 5 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఒంగోలు టౌన్: ముగ్గురు పేకాటరాయుళ్లను ఒంగోలు తాలూకా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నగరంలోని కర్నూలు రోడ్డు మారుతీనగర్ ఒకటో లైన్ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ వి.శ్రీనివాసరెడ్డి సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ పేకాటాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అంకమ్మ, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

సీఎం కప్ టెన్నిస్ లీగల్ పోటీలు ప్రారంభం

గిద్దలూరు రూరల్: శాప్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీఎం కప్ టెన్నిస్ లీగల్ పోటీలను పట్టణంలోని టెన్నిస్ కోర్టు ఆవరణలో ఆదివారం జిల్లా లాన్ టెన్నిస్ అధ్యక్షుడు డా.జి.కె.మోహన్‌రెడ్డి, గిద్దలూరు లాన్ టెన్నిస్ అధ్యక్షుడు డా.సి.హెచ్.రంగారెడ్డి ప్రారంభించారు. డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 10 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకు ఈ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. 5 మంది బాలురు, 5 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. టెన్నిస్ కార్యదర్శి వీరరాఘవులు, కోచ్ మురళీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కోశాధికారి ఖాదర్ బాష, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రికెట్ విన్నర్ పొట్టిపల్లె టీం

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సంక్రాంతి పురస్కరించుకుని గిద్దలూరు తాలూకా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను దాదాపు 10 రోజులపాటు నిర్వహించగా 25 టీంలు పోటీపడ్డాయి. పొట్టిపల్లె రామక్రిష్ణ టీం, పామూరుపల్లె భాస్కర్ టీంలు ఫైనల్స్‌కు చేరుకుని తలపడగా పొట్టిపల్లె రామక్రిష్ణ టీం విన్నర్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు రూ. 30 వేల నగదు బహుమతిని అందించగా రన్నర్‌గా నిలిచిన పామూరుపల్లె భాస్కర్ టీంకు 20 వేల రూపాయలు, తృతీయ బహుమతి శివాజీనగర్ శేఖర్ టీమ్‌కు 10 వేల రూపాయలు అందించారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీలు షేక్ సుభాని, తిరుమలరాజు, వెంగయ్యచౌదరి, రమణరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

వేటపాలెం: వేటపాలెం రైల్వే స్టేషన్‌కి దక్షిణం వైపున రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతుడికి 60 సంవత్సరాలు ఉంటుందని, తెల్లజుట్టు, రంగుల చొక్కా, పచ్చకలర్ లుంగీ ఉందని చెప్పారు. రైల్లో ప్రయాణిస్తూ గేటు వద్ద నుంచి ప్రమాదవ శాత్తు జారి కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- అర్హులందరికీ అమలు
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నాయకులు, అధికారులు

మద్దిపాడు: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మద్దిపాడులో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులకు కూడా అనేక సంక్షేమ పథకాలు వర్తించాయని తెలిపారు. ఎన్నికల వరకే పార్టీలని, ఆ తర్వాత రాష్ట్రంలోని ప్రజలందరినీ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వ్యక్తి సమానంగా చూసుకోవాలని చెప్పే గొప్ప మనసున్న మహారాజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వంలో అర్హత ఉన్నా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. గతంలో పెన్షన్ల కోసం పంచాయతీల వద్ద రోజుల తరబడి వృద్ధులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు వలంటీర్ల వ్యవస్థ ద్వారా పెన్షన్ల నగదు అందుతుందన్నారు. మండల కార్యాలయాల్లో గతంలో సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం మండల కార్యాలయాలకు సర్టిఫికెట్ల కోసం ఎవరూ రావడం లేదని, అన్నీ గ్రామ సచివాలయాల్లోనే ఒకరోజు వ్యవధితోనే మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రపంచ దేశాలు, దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసే విధంగా ఏపీని తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటే.. అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఆర్‌బీకేలను పరిశీలించడానికి విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పని తీరు ఎలా ఉందో అర్థమవుతుందన్నారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి...

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగనన్నపై బురద చల్లించడానికి పలు కథనాలు వండి వారుస్తున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ మండిపడ్డారు. ప్రస్తుత రాజకీయాలను ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారని, ప్రజల కోసం పాటు పడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే.. కాలనీలో ప్రాధాన్యతా క్రమంలో సైడు డ్రైన్లు నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముందుగా మద్దిపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మహిళలు ఎమ్మెల్యేకి హారతులిచ్చి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 50 వేల గడపలను సందర్శించిన సందర్భంగా దాసరికాలనీలో యువకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. నాగులుప్పలపాడు మండల నాయకులు శాలువా కప్పి బొకే ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు, వైస్ ఎంపీపీలు మోరబోయిన విజయలక్ష్మి, పైడిపాటి వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, నర్రా సురేష్, మోరబోయిన సంజీవరావు, గుడ్లపాతల రవి, మద్దా లక్ష్మీనారాయణ, మజీద్, మేకల కృష్ణారెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి, రాజీవ్‌రెడ్డి, మహానందరెడ్డి, ప్రసన్నాంజి, షేక్ బాబు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ సభ్యులు పైనం ప్రభాకర్, ఏసుదాసు, సన్నపురెడ్డి రమణమ్మ, జయమ్మ, మస్తానమ్మ, గ్రామ సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు లక్ష్మీనారాయణాచార్యులు, నట్టే అనిల్, నాగులుప్పలపాడు నాయకులు పరంధామిరెడ్డి, అంకిరెడ్డి, వడ్డిముక్కల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, హరిబాబు, నన్నెబోయిన శివ, కన్వీనర్లు బత్తుల శీను, కొమ్మూరి సుధాకర్, మంద చిన్న, నల్లూరి రాజా, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


బాలినేని, జంకె సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

- ఎమ్మెల్యే బాలినేని సమక్షంలో పాతిక మంది చేరిక
- ప్రభుత్వ పనితీరు నచ్చి పార్టీలోకి వస్తున్నామని వెల్లడి

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్నామని, ప్రభుత్వ పనితీరు నచ్చి వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు ఆధ్వర్యంలో పాతిక మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి వచ్చి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో బత్తుల వెంకటేశ్వర్లు, తన్నీరు ఆంజనేయులు, బత్తుల వెంకట నాగేశ్వరరావు, బత్తుల వినోద్, బత్తుల శ్రావణి, బురుసు శ్రీను, బురుసు అంకమ్మరావు, తమ్మిశెట్టి శ్రావణి, గుంజి రత్తమ్మ, కుంచాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్ చెన్నుపాటి కుటుంబాన్ని పరామర్శించిన బాలినేని...

ఒంగోలు 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ తల్లి పెదకర్మకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. వేణుగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నగర మేయర్ గంగాడ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కేంద్రంలో 962 మంది హాజరు


ట్రిపుల్ ఐటీ కాలేజీ వద్ద తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని ట్రిపుల్ ఐటీ కాలేజీ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల రాత పరీక్షకు 962 మంది హాజరైనట్లు ఎస్సై బీ శ్రీకాంత్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రానికి మొత్తం 1,040 మంది అభ్యర్థులను కేటాయించగా, వారిలో 78 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ జయరామిరెడ్డి పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

26న అక్షరాభ్యాస మహోత్సవం

ఒంగోలు: వసంత పంచమి సందర్భంగా ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించనున్నట్లు స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ప్రబంధకారిణి కొండపల్లి రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు గాయత్రీ పరివార్ కార్యకర్తలచే గాయత్రీ యజ్ఞం, విద్యారంభ సంస్కారం నిర్వహించనున్నట్లు చెప్పారు. పిల్లలను అక్షరాభ్యాస కార్యక్రమానికి విద్యాలయ ప్రాంగణానికి తీసుకురావాలని, వారికి ఉచితంగా పలక, బలపంతో పాటు యజ్ఞప్రసాద వితరణ చేస్తామని చెప్పారు.

అత్యవసర చికిత్సపై అవగాహన అవసరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవాణా శాఖ అధికారులు

ఒంగోలు అర్బన్: 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు రవాణా శాఖ అధికారులు ఆదివారం స్థానిక సంఘమిత్ర ఆస్పత్రిల్లో గుడ్ సమార్టం లాపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించడంతో పాటు రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవ

ఒంగోలు టౌన్: తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్ సూచనలు, సలహాల మేరకు రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యుడు దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ఒక ప్రైవేటు హోటల్‌లో ఆదివారం మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. కేవలం 50 మందితో ప్రారంభమైన తమ స్వచ్ఛంద సంస్థలో నేడు రెండు వేల మంది వలంటీర్లు ఉన్నారని చెప్పారు. రానున్న రోజుల్లో 10 వేల మంది వలంటీర్లను చేర్చుకోవడమే తమ లక్ష్యమన్నారు. అవసరార్థంలో ఉన్న అన్నార్థులు, నిరుపేదలకు సాయం చేయడం, 365 రోజుల పాటు అన్నదానం, రక్తదానం, ప్రభుత్వ పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం చేయనున్నట్లు చెప్పారు. దీంతో పాటుగా రోడ్ సేఫ్టీ, మహిళల భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు షేక్ ఉమర్, నల్లూరి సాయిరూప్, పి.సుధీర్, పవన్, కె.లక్ష్మీదుర్గా, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులపై అపోహలు వద్దు


విద్యుత్ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

- విద్యుత్ లోక్ అదాలత్‌లో ఈఈ శ్రీనివాసరావు

కొత్తపట్నం: విద్యుత్ బిల్లులపై అపోహలు వద్దని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విద్యుత్ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక ఇంటికి కేటాయించిన లోడు కంటే అదనంగా వాడుకుంటుంటే అదనపు డిపాజిట్ చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. అలా ఒక బిల్లులో అదనపు డిపాజిట్ చెల్లించాలని వచ్చిందని, దానిపై అవగాహన లేక అధికంగా బిల్లు వచ్చిందని అపోహ పడుతున్నారని వివరించారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఇంట్లో విద్యుత్ వాడకం పెరిగినందున అదనపు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. కనెక్షన్ ప్రారంభంలో తీసుకున్న లోడు ప్రకారమే విద్యుత్ వాడుకుంటే అదనపు డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్లలోపు వాడుకుంటే బిల్లు చెల్లించాల్సిన అవసరం కూడా లేదన్నారు. అందుకోసం కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసి ఉచితంగా కరెంటు పొందవచ్చని తెలిపారు. మీటర్‌లో పొరపాటు ఉంటే పరిశీలించి మార్చడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను అధికారులకు తెలిపారు. పలు విద్యుత్ సమస్యలపై మొత్తం 73 అర్జీలు వచ్చాయి. అదనపు లోడు వాడుకుంటున్న వారు 47 మంది, కొత్త లైన్ కావాలని ఒకరు, బిల్లు వాయిదా కోసం ఒకరు, బిల్లు ఎక్కువ వచ్చిన వారు 24 మంది అర్జీలిచ్చారు. అక్కడికక్కడే 18 మంది అర్జీలను పరిష్కరించారు. వినియోగదారుల నుంచి రూ.1,13,260 బిల్లులు వసూలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజజినీర్ ఆర్.మోహన్‌రావు, ఎస్ఏవో సుబ్బారావు, ఏవో (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి, ఏఈ జీ వీరాంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్ మాధవరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య ద్వారానే గిరిజనుల అభివృద్ధి

- ఆదివాసీల ఉద్యోగుల సంఘ నాయకులు
- వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

చీమకుర్తి: సమాజంలో ఉన్నత స్థానం పొందాలన్నా, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా విద్య ద్వారానే సాధ్యమవుతుందని ఆదివాసీల ఉద్యోగుల సంఘ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు కొమరగిరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివాసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని చీమకుర్తిలోని ఏకలవ్యనగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులంతా ఐక్యంగా హక్కులు సాధించుకోవడానికి పోరాటం సాగించాల్సి అవశ్యకత ఉందన్నారు. అనంతరం ఆదివాసీల ఉద్యోగుల సంఘ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం కుమార్‌ధర్మ, డాక్టర్ బీ జవహర్, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, మోటా శ్రీనివాసరావు, మర్రి లక్ష్మీనారాయణ, చింతకింది అశోక్, చింతలపాలెం బాబు, పాదిలి కాశయ్య, పాటిబండ్ల రాజసులోచన, పిన్నిక శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు


విజేతలకు ట్రోఫీ, ప్రశంసపత్రాలు అందిస్తున్న సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీ కృష్ణ

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు దేశభక్తి బృందగాన పోటీలు నిర్వహించారు. మొత్తం 22 బృందాలు విచ్చేసి వివిధ పాఠశాలల అధ్యాపకుల నిర్వహణలో చిన్నారులు వారి ప్రతిభను ప్రదర్శించారు. పొన్నూరి వెంకట శ్రీనివాసులు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, న్యాయ నిర్ణేతలుగా కె.శ్రీనివాసరావు, పద్మ, టి.మురళి వ్యవహరించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీ కృష్ణ, ఏకేవీకే విద్యా సంస్థల అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం కార్యదర్శి టీవీఎస్ శర్మ, సంస్కార భారతి సంయోజకుడు పత్తి రంగమన్నార్ పాల్గొని ఉపన్యసించారు. భావితరాలకు మన చరిత్రను అందించడంలో కళల పాత్ర వివరించారు. దేశభక్తి బృందగాన పోటీలకు వచ్చిన పిల్లలందరికీ ఆశీసులు అందించారు. ఉత్తమ బృందగాన ఎంపికలుగా మాంటిస్సోరి విద్యార్థులు, భాష్యం స్కూలు, జ్యూపిటర్ స్కూలు విద్యార్థులు నిలిచారు. అనంతరం వారికి బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రశంసపత్రాలు అందించారు.

ఈర్ల గంగమ్మకు భక్తుల పొంగళ్లు

- ఆలయంలో భక్తుల కోలాహలం
- రూ.20 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనులు

బల్లికురవ: మాఘమాసం ప్రారంభం మొదటి ఆదివారం సందర్భంగా మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల గంగమ్మ ఆలయం వివిధ గ్రామాల్లోని భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ బల్లికురవ, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, చెన్నుపల్లి, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొప్పరపాలెం గ్రామాల్లోని భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నివేదించి, తమ మొక్కులు తీర్చుకున్నారు.


పొంగళ్లు పెడుతున్న భక్తులు


ఏర్పాటు చేసిన శివకుటుంబం విగ్రహాలు

ఆలయ అభివృద్ధి..

ఇటీవలి కాలంలో నక్కబొక్కలపాడు గ్రామస్తులు ఈర్లకొండ గ్రానైట్ వ్యాపారుల సమష్టి కృషితో సుమారు రూ.50లక్షలతో ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ఆలయం ముందు వేదిక ఏర్పాటుతోపాటు, శివపార్వతుల కుటుంబం, కళ్యాణకట్ట, భక్తుల విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. ఆలయానికి వెళ్లే దారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ఇటీవలే మండల నిధులు రూ.20 లక్షలు కేటాయించారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఆలయం వరకు మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నిర్మాణ పనులకు ఇటీవల భూమి పూజ చేశారు. సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సిమెంట్ రోడ్డుగా మార్చడం వల్ల వర్షాకాలంలోనూ అమ్మవారిని దర్శించుకునే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా గుంటి గంగా భవాని పూజలు

తాళ్లూరు: గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివాకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయానికి రూ. 16,632 ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతులు జరిగాయి. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

మార్కాపురం: పట్టణ శివారులోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర సందర్భంగా భక్తి శ్రద్ధలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలు పట్టు వస్త్రాలు సమర్పించారు. చక్కా మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం, రామక్రిష్ణ తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


మార్కాపురం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఓంకార క్షేత్రంలో ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: చీరాల కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలోని ఓంకార క్షేత్రంలో నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంలో రాజగోపురం, కాలభైరవ, చండీశ్వర, దక్షిణామూర్తి, రాహు కేతువులు, బలిపీఠాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని పురవీధుల్లో విగ్రహాలను మేళతాళాలతో నగరోత్సం నిర్వహించారు. ఈనెల 27వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కార్యదర్శి ఎం.రామకృష్ణ శర్మ, జీవీ లక్ష్మీరమణలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.


అలంకరణలో స్వామివార్లు